క్లుప్తంగా

నేడు లక్ష దీపోత్సవం

బి.కొత్తకోట: బి.కొత్తకోటలో కార్తీక మాసం పురస్కరించుకుని ఏటా నిర్వహిస్తున్న లక్ష దీపోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. స్థానిక పీటీఎం రోడ్డుపై మహిళలు దీపాలు వెలగించేలా లక్ష దీపాలను సిద్ధం చేస్తున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శ్రీమహా విష్ణుసేన కమిటీ కృషి చేస్తోంది.

శివాలయం నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి, రామసుబ్బమ్మ

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో నిర్మాణంలో ఉన్న శివాలయానికి దాతలు రూ. 1,01,116 విరాళం అందజేశారు. గర్నిమిట్ట పంచాయతీ వంకాటపల్లెకు చెందిన మూలస్థానమ్మ ఆలయం చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ రామసుబ్బమ్మ గురువారం విరాళాన్ని ఆలయ నిర్వాహకులు చంద్రయ్యకు అందజేశారు.

ప్రజలకు మెరుగైన సేవలందిస్తాం

రామసముద్రం : సిబ్బంది సహకారంతో ప్రజలకు, వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తామని రామసముద్రం సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రవి తెలిపారు. గురువారం బ్యాంక్ మేనేజర్‌గా రవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న శాంతి ప్రియాంక మెటర్నరీ సెలవులో వెళ్లడంతో శాంతిపురంలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయనను రామసముద్రంకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, మహిళా సంఘాలకు, రైతులకు బ్యాంకు సేవలను సకాలంలో అందించేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి


పెద్దకురప్పల్లె సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ భానుప్రసాద్

రామసముద్రం : రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె సచివాలయాన్ని గురువారం ఎంపీడీఓ భానుప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరును, టూర్‌ప్రోగ్రాం రిజిష్టర్‌లను పరిశీలించారు. సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సురేంద్ర, సిబ్బంది ఉన్నారు.

అమ్మవారికి వెండి కవచం బహూకరణ


అమ్మవారికి కవచం బహూకరించిన దాతలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకాలమ్మ దేవస్థానంలో అమ్మవారికి ఉప సర్పంచ్ తోటశివసాయి కుటుంబీకులు గురువారం వెండి కవచాన్ని బహూకరించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి వెండి కవచం అలంకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుదుగు శివయ్య, సీహెచ్ రమేష్, మందల నాగేంద్ర, మారెళ్ల రాజేశ్వరి, ముత్యాల కిషోర్, నూకా మహేష్‌రెడ్డి సిద్దు, త్రివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

లక్కిరెడ్డిపల్లి : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని లక్కిరెడ్డిపల్లి గురుస్వాములు రమణ, వెంకటేష్, గంగరాజు, వేణు, రమణలు పేర్కొన్నారు. అనంతపురం గ్రామానికి చెందిన అయ్యప్ప మాలాధారుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. చిన్నాపెద్ద తేడా లేకుండా ప్రతి వ్యక్తిని దైవ స్వరూపంగా భావించడమే అయ్యప్ప దీక్ష పరమార్థమన్నారు. భక్తి శ్రద్ధలతో వైభవోపేతంగా అంబలం పూజ జరిగిన పూజలో ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. అయ్యప్ప భజనలు అనంతపురం గ్రామం మార్మోగింది. అయ్యప్ప మాలాధారణ భక్తులకు అన్నదానం (భిక్ష) ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు బుజ్జి, సాయి, సుధీర్ కుమార్, గంగాధర్ రాజు, శ్రీను, గంగయ్య, బోస్, పెద్దసంఖ్యలో అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు. కాగా నామాలగుట్టపై ఉన్న అయ్యప్ప ఆలయంలో గురువారం మద్దిరేవులకు చెందిన రంగారెడ్డి మాలాధారులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పంట మార్పిడి.. అధిక రాబడి

- ఒకే రకం సాగుతో నష్టాలు
- తగ్గుతున్న భూసారం
- రోగకారక కీటకాల కట్టడికి ఎంతో మేలు


గుట్టకిందపల్లెలో సాగుచేసిన సజ్జపంట

గుర్రంకొండ: ఏడాదిలో ప్రతిసారీ ఒకేరకం పంటను సాగు చేయడం వలన భూసారం తగ్గడంతో పాటు చీడపీడలు పంటలను ఆవహించడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఏడాదిలో రెండు నుంచి మూడు రకాల పంటల సాగు మార్పిడి పద్ధతి అవలంబించడం వలన రైతులకు అధిక దిగుబడులతో పాటు లాభాలు వచ్చే అవకాశముంది. పంటల సాగు మార్పిడి పద్ధతికి రబీసీజన్ అదనుగా ఉంటుందని వ్యవసాయాధికారులు అంటున్నారు, రైతులు ఇప్పుడిప్పుడే వాస్తవాలను గ్రహించి పంటమార్పిడి సాగు పద్ధతిని అలవాటు చేసుకొంటూ భూసారాన్ని పెంపొందించుకొంటున్నారు.

ఒకే రకం పంట సాగుతో నష్టాలే

జిల్లాలోని పడమటి ప్రాంతాల రైతులు టమాటా పంటను ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఎంతటి సారవంతమైన పొలాల్లో అయినా ఏడాది పొడవునా ఒకే రకం పంట సాగు చేయడంతో రైతులు నష్టాలు చెవిచూస్తున్నారు. అయితే కొందరు రైతులు పంటసాగు కాలం ముగిసిన తరువాత రెండు నుంచి మూడు నెలలు విరామం ఇచ్చి అదే నేలలో మళ్లీ గతంలో సాగు చేసిన రకం పంటనే సాగు చేస్తుంటారు. దీంతో ఎంత నాణ్యత కలిగిన నేలలోనైనా పంట దిగుబడి తగ్గడంతో పాటు రోగాలు, చీడపీడలు ఎక్కువై రైతులు నష్టపోతున్నారు. దీంతో భూమిలో భుసారం తగ్గడం ద్వారా రైతులకు నష్టాలే తప్ప ప్రయోజనం కనిపించడం లేదు.

మారుతున్న రైతుల ఆలోచనా విధానం

ఒకే రకం పంట సాగుతో నష్టాలు చవిచూస్తున్న రైతుల ఆలోచనా విధానం మారుతోంది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఇప్పుడిప్పుడే తమ ఆలోచనాధోరణిని మార్చుకొంటున్నారు. ప్రధానంగా పంట మార్పిడి చేసే ముందు అంతకు ముందు రైతులు గతంలో వేసిన ప్రధాన పంటకు భిన్నంగా పెరిగే పైరును ఎంచుకోవాల్సి ఉంటుంది. భూమికి సత్తువ, పోషకాలను ఇచ్చే పైరులను ఎంచుకోవడం ఎంతో లాభదాయకంగా ఉంటుంది. ఈ పద్ధతి వలన పైరులు ఆకులు రాల్చి, భూమికి సేంద్రియ పదార్థాలను అందజేస్తాయి. సూక్ష్మజీవుల చర్య ఫలితంగా ఎంజైములు ఉత్పత్తి అవుతాయి. విభిన్న పంటల సాగుతో పైరుకు కొంత మేరకు నత్రజని ఎరువు లభిస్తుంది. కంది, శనగ పైర్లు వరుసగా వేస్తే కాయ తొలుచు పురుగులు తాకిడి అధికంగా ఉంటుంది. అదే జొన్న, సజ్జ, రాగి, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ వంటి పంటల సాగుతో పంట మార్పిడి చేసుకోవడం రైతుకు లాభదాయకం.

ప్రత్యామ్నాయ పంటలతో ఫలితాలు

ఏడాది పొడవునా ఒకే రకం పంటల సాగు విధానానికి స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం వలన రైతులు మంచి ఫలితాలు సాధించవచ్చు. వరుసగా టమాటా సాగు చేసే రైతులు ఆవాలు, బంతి, ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేస్తే నులిపురుగుల ఉధృతి తగ్గుతుంది. వరితో పంట మార్పిడి చేయడం ద్వారా వేరుశనగ పైరుకు నులిపురుగుల బెడద ఉండదు. వంగ తోటలు సాగు చేసేవారు క్యాలీఫ్లవర్ సాగు చేయడం ద్వారా వంగకు ఎండు తెగులు సోకదని వ్యవసాధికారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు చేయడం వలన పొలంలో భూసారం పెంపొందుతుంది. భూసారం పెరగడం వలన పంట సాగులో చీడపీడలను కొంత వరకు అరికట్టవచ్చు.

రైతుకు లాభాలు



పంటమార్పిడితో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయి. భూసారం పెరగడంతో పాటు పంటలకు మంచిపోషకాలు లభిస్తాయి. చీడపీడల నివారణ, పంటపోషకాల కోసం చేసే ఖర్చు సగానికిపైగా తగ్గుతుంది. దీంతో రైతులు లాభపడవచ్చు. రైతులు తప్పనిసరిగా ఈ పద్ధతిని అనుసరిస్తే ప్రయోజనం పొందవచ్చు. ఇప్పుడిప్పుడే రైతులు పంటల మార్పిడి పద్ధతికి అలవాటు పడుతున్నారు.

– రత్నమ్మ,
వ్యవసాయాధికారిణి, గుర్రంకొండ

మూలకు చేరిన చెత్త బండ్లు.. పడకేసిన పారిశుద్ధ్యం


బయ్యప్పగారిపల్లె సచివాలయం వద్ద వృథాగా వదిలేసిన చెత్త బండ్లు

బి.కొత్తకోట: పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వం, అధికారులు గొప్పలు చెబుతుంటారు. అయితే క్షేత్రస్థాయి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపల్లె పంచాయతీలో పారిశుద్ధ్య పనుల కోసం వినియోగించే బండ్లను అధికారులు మూలనపడేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన అధికారుల పనితీరు ఎలా ఉందో సచివాలయం వద్ద శిథిలావస్థకు చేరిన చెత్త తరలించే బండ్లను చూస్తే అర్థమవుతుంది. పల్లెల్లో పారిశుద్ధ్య పనులు చేపడితే ఈ బండ్ల అవసరం ఉంటుంది. పనులు చేయించకపోతే ఇలా వృథాగా పడి ఉంటాయి. దీంతో గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని వీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'మందుబాబులకు అడ్డాగా అగ్రి ల్యాబ్ భవనం'


నిర్మాణంలో ఉన్న అగ్రి ల్యాబ్ భవనం

పీలేరు : స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో ఉన్న అగ్రి ల్యాబ్ భవనం మందుబాబులకు అడ్డాగా మారిందని జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు బోదిషావలి అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ రైతులకు విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు పరీక్షలు చేసేందుకు వీలుగా ల్యాబ్ నిర్మాణం చేపట్టారన్నారు. ఈ భవన నిర్మాణం అసంపూర్ణంగా ఉండడంతో రాత్రి సమయంలో మందు బాబులకు ఆవాసంగా మారిందని తెలిపారు. ఈ భవనంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నివారించాలంటే నిర్మాణం పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

వివాదాస్పద భూమి పరిశీలన


భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరురూరల్ : మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీలో వివాదాస్పదంగా ఉన్న సర్వే నంబరు 562/2లో 50 సెంట్లు, 562/3లో 20 సెంట్లు, మొత్తం 70 సెంట్ల భూమిని తహసీల్దార్ భీమేశ్వర్ రావు పరిశీలించారు. యర్రగుంట్లపల్లె పంచాయతీలో తమ మామ అయిన చీకటిపల్లె లక్ష్మయ్య పేరుతో ఉన్న 70 సెంట్ల భూమిని సర్వే చేసి తమకు హద్దులు చూపాలని ఆయన కోడళ్లు సి. అంజమ్మ, సి. లక్ష్మి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో గురువారం తహసీల్దార్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్థలంలో ఎవరూ ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని, రికార్డులు పరిశీలించిన తరువాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ కిరణ్మయి, వీఆర్‌ఓలు ఇమ్రాన్, హేమంత్ నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన ఆధార్ సేవలు

పెద్దతిప్పసముద్రం: అపార్ ఐడీ జనరేట్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు అధికారులు మండలంలోని రెండు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు మండలంలోని కాట్నగల్లు, పీటీఎం సచివాలయాలకు వెళ్లి ఆధార్ కార్డుల్లో పేరు, చిరునామా, పుట్టిన తేదీలు సవరించుకునేవారు. ఈ నేపథ్యంలో కాట్నగల్లు సచివాలయంలో డీఏగా పని చేస్తున్న విశ్వనాథ్ ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేపట్టేవారు. అయితే డిజిటల్ అసిస్టెంట్ అనారోగ్య సమస్యల కారణంగా సెలవులో వెళ్లడంతో ఆధార్ సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీరాములు నాయక్‌ను గురువారం వివరణ కోరగా డీఏ సెలవు విషయం తమ దృష్టికి రాలేదని, సదరు వ్యక్తిపై రిపోర్ట్ పంపమని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌ను ఆదేశించామని చెప్పారు. విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం ఆధార్‌సేవలనుకొనసాగించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

పడిపూజ ఆహ్వాన ప్రతికల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఉత్సవ కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ: అయ్యప్పస్వామి ఆలయంలో జరిగే పడి పూజ కరపత్రాలను ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌భాషా, ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఆవిష్కరించారు. డిసెంబర్ 4న జరిగే పడిపూజ కార్యక్రమానికి కేరళ తంత్రి మనోజ్‌నబూద్రి హాజరుకానున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 3వ తేదీన భగవతి పూజ జరుగుతుందన్నారు. పడిపూజకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. పూజకు మహిళలు పాల్గొనవచ్చునన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బాలుస్వామి, విజయలక్ష్మి భాస్కర్, శశికుమార్, జర్మన్‌రాజు, అమర, శివమూర్తి, బాలకృష్ణ, పోస్టల్ రమణ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు పోరుబాట

రాయచోటి అర్బన్ : డిసెంబరు 4న విజయవాడలో జరిగే ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా నేత మావులూరి విశ్వనాథ పిలుపునిచ్చారు. గురువారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలసి ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలంటూ రాయచోటి పట్టణంలో కరపత్రాల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తర్వాత వాటిని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో కూటమి నేతలు అనుసరిస్తున్న తీరు సరైంది కాదన్నారు.

రేపు తుక్కు వేలం

బి.కొత్తకోట: బి.కొత్తకోట పట్టణంలో తొలగించిన ఆక్రమణల్లోని ఇనుము, రేకులు తదితర వాటిని వేలం వేసి విక్రయించేందుకు నిర్ణయం తీసుకున్నామని కమిషనర్ పల్లవి గురువారం తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించే వేలం పాటలకు రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు. అధిక పాటదారుడు తుక్కును తరలించుకోవచ్చని తెలిపారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత


ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రామసముద్రం : బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని రామసముద్రం మండలం మట్లవారిపల్లె హైస్కూల్ హెచ్‌ఎం బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం విద్యార్థులతో కలసి బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను నిర్మూలించేందుకు కృషి చేయాలని కోరారు. మైనర్లకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. ప్రభుత్వాలు బాలికల సంరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయులచే ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం



కురబలకోట: మాట్లాడుతున్న కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మోనిష్

కురబలకోట: ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యత లభిస్తుందని చిత్తూరు 35వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎంఎస్ మోనిష్ పేర్కొన్నారు. గురువారం అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్స్, తల్లిదండ్రులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఎన్‌సీసీలో చేరాలన్నారు. శిక్షణ అనంతరం లభించే ఏబీసీ సర్టిఫికెట్లతో విద్యార్థుల ఉన్నత విద్యకే కాకుండా వివిధ ఉద్యోగాలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎంసెట్, ఈసెట్, ఐసెట్, ఎడ్‌సెట్, పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ప్రత్యేక కేటగిరిగా పరిగణించి సీట్లు కేటాయిస్తారన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, పోలీస్, అగ్నివీర్ సెలక్షన్లలో ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. అంతేగాకుండా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, నిఘా, సెక్యూరిటీ తదితర ఉద్యోగాల్లో వీరికి తొలి ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు.

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి

నిమ్మనపల్లె : విద్యార్థి దశ నుంచే ప్రతి విద్యార్థి దేశభక్తి, క్రమశిక్షణ కలిగి ఉండాలని 35 ఏబీఎన్ ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ ఎన్.బి.మోనిష్ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ క్రమశిక్షణకు మారుపేరన్నారు. విద్యార్థులు ఎన్‌సీసీతో పాటు చదువులోనూ ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎన్‌సీసీ శిక్షణలో ఉత్తమ ప్రతిభ చూపుతూ ప్రత్యేక శిక్షణా శిబిరాలకు ఎంపికవుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇదే విధమైన శిక్షణను విద్యార్థులు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాణి, రవి, సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిమ్మనపల్లె : ఎన్‌సీసీ విద్యార్థులతో బెటాలియన్ కమాండర్

మాజీ ఎమ్మెల్యే నివాళి


లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు

గుర్రంకొండ: మండలంలోని రామాపురం కస్పాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు తిమ్మయ్య తల్లి లక్ష్మమ్మ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం ప్రకటించారు. లక్ష్మమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. గురువారం మాజీ ఎమ్మెల్యే రామాపురం కస్పాకు చేరుకొని లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబసభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీరమణ, మాజీ వైస్ ఎంపీపీ రెడ్డి నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల రెడ్డెప్ప పాల్గొన్నారు.

పరామర్శ

కలికిరి (వాల్మీకిపురం): మండల కేంద్రం ఎన్టీఆర్ కాలనికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శేషాద్రి కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం ఉదయం శేషాద్రి కుమార్‌ను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. జెడ్పీటీసీ నిర్మలా ఆనంద్, మైనార్టీ నేత అబ్దుల్ కలీం, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డ కేశవరెడ్డి పాల్గొన్నారు.

డీసీహెచ్‌ఎస్ బృందం విచారణ


డాక్టర్లను విచారిస్తున్న డీసీహెచ్‌ఎస్ డేవిడ్ సుకుమార్ బృందం

తంబళ్లపల్లె : స్థానిక వైద్యవిధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ల ఫిర్యాదులపై గురువారం డీసీహెచ్‌ఎస్ డేవిడ్ సుకుమార్, పీలేరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, రాయచోటి అనస్థీషియన్ వెంకటశివ బృందం ఆస్పత్రిలో విచారణ చేపట్టింది. గతంలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన వెంకటరామయ్య, వైద్యుల మధ్య సమన్వయ లోపంతో ఒకరిపై ఒకరు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ఫిర్యాదులు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ వెంకటరామయ్యను బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై బదిలీచేస్తూ, గైనకాలజిస్ట్ డాక్టర్ తేజస్వికి మెడికల్ ఆఫీసర్ బాధ్యతలు అప్పగించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ల బృందం సమగ్ర విచారణ చేపట్టారు. ఆస్పత్రి సిబ్బంది, డాక్టర్లను విడివిడిగా విచారణ చేశారు. విచారణలో వెల్లడైన అంశాలపై నివేదికలను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని విచారణ బృందం డాక్టర్లు తెలిపారు. ఈ విచారణ రాత్రివరకు కొనసాగింది.

ఆక్రమణలు తొలగించకపోతే ఉద్యమం

గాలివీడు : ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించకపోతే ఉద్యమం చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్దిగాళ్ల శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని గేటు నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆక్రమణకు గురైన ఆర్ అండ్ బీ స్థలాన్ని స్థానిక సీపీఐ నాయకులతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వే నంబర్ 2266లో ఉన్న ఆర్ అండ్ బీ స్థలాన్ని ఇష్టానుసారంగా వాటాలు పంచుకుని అక్రమంగా రేకులను ఏర్పాటు చేయడం వారి బరితెగింపునకు నిదర్శనమని మండిపడ్డారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు.

సామాజిక దార్శనికుడు జ్యోతిరావు పూలే


కలికిరి (వాల్మీకిపురం): వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల తదితరులు


మదనపల్లె : పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, నాయకులు, కార్యకర్తలు

మదనపల్లె : కుల వివక్షతకు వ్యతిరేకంగా, సమసమాజ నిర్మాణం కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ కొనియాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు కృషి చేసిన సంఘసంస్కర్త పూలే నిత్య స్ఫూర్తి ప్రదాత అంటూ ప్రశంసించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునిశేఖర్, మహేష్, పూజారి చరణ్, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోని పూలే విగ్రహం వద్ద పంచాయతీరాజ్ ఏఈ రాయల్ రాజేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ సురేష్‌కుమార్, నాయకులు బెల్లే ప్రసాద్, ఆర్.నీలకంఠ తదితరులు పాల్గొన్నారు. విద్యను ప్రజాస్వామీకరించిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా పూలే అంటూ భారతీయ అంబేడ్కర్ సేన (బాస్)వ్యవస్థాపకులు పీటీఎం.శివప్రసాద్ అన్నారు. పూలే 134వ వర్ధంతి సందర్భంగా స్థానిక బాస్ కార్యాలయంలో చిత్రపటాన్ని పూలతో అభిషేకించి ఘనంగా నివాళులు అర్పించారు. కులవివక్ష, అంటరానితనంపై పోరాటం చేసి బడుగు, బలహీన వర్గాలకు హక్కులు, మహిళలకు విద్య అవకాశం కల్పించిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మాజ్యోతిరావు పూలే అని బహుజన యువ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు పునీత్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో బీవైఎస్ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. తట్టివారిపల్లె గ్రామసచివాలయంలో వైఎస్సార్ సీపీ సర్పంచ్ సిద్దలదీపా, నాయకులు వేమారెడ్డి ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనుసరనీయుడు జ్యోతిరావు పూలే

కలికిరి (వాల్మీకిపురం): మహాత్మా జ్యోతిరావు పూలే అనుసరనీయుడని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటం ఏర్పాటు పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఆయన జాతికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. అయన అడుగుజాడల్లో నడుద్దామమని రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫ్యల్యాలను ప్రశ్నించిన మీడియాపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో ఇసుకను అధికార పార్టీ నేతలు దోచుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ నీళ్ల భాస్కర్, సర్పంచ్ గంగులమ్మ, వాల్మీకిపురం వైస్ సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాజేష్, శ్రీనివాసులుశెట్టి, నాయకులు గాంధీపేట రాఘు, మహేష్, రామక్రిష్ణారెడ్డి, శ్యామ్ పాల్గొన్నారు.


మదనపల్లె: అంబేద్కర్ సర్కిల్‌లో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పునీత్, సభ్యులు